క్లుప్తంగా

శాంతియుత జీవనం గడపాలి

బేతంచెర్ల: ప్రజలు శాంతియుత జీవనం గడపాలని, ఘర్షణలు, కక్షలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామాన్ని ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో ఎస్‌ఐ మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న నేరాలు, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. రైతులు ఎప్పుడూ మనో ధైర్యం కోల్పోకుండా ముందుకు సాగాలని, మీకు ఇబ్బంది కల్గినప్పుడు పోలీసులను ఆశ్రయించాలన్నారు. ఆపద సమయంలో మహిళలు, బాలికలకు దిశయాప్ అండగా ఉంటుందన్నారు.

పశువుల బీమాను సద్వినియోగం చేసుకోండి

కొలిమిగుండ్ల: పాడి రైతుల కోసం ప్రభుత్వ అమలు చేస్తున్న పశువుల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారిణి పద్మావతి మంగళవారం తెలిపారు. వివిధ రకాల వ్యాధులు,ప్రమాదవశాత్తు గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు మరణిస్తే రైతులకు మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం బీమా పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. లబ్ధిదారుల వాటా కింద 20 శాతం ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల పాటు చెల్లుబాటు అవుతుందన్నారు. పశు, జీవ సంపద మరణించిన 21 రోజుల్లోనే లబ్ధిదారుల ఖాతాల్లో పరిహారం జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. సంకర జాతికి చెందిన పశువులు, గేదెలు,ఎద్దులు మృతి చెందితే ఒక్కో దానికి రూ.30వేలు చొప్పున పరిహారం అందుతుందన్నారు. అలాగే దేశీయ పశుజాతి అవులు, గేదెలు,ఎద్దులు మరణిస్తే రూ.15వేలు, గొర్రెలు, మేకలు మరణిస్తే ఒక్కో దానికి రూ.6వేలు ప్రకారం పరిహారం అందుతుందన్నారు.

నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలి

బనగానపల్లెరూరల్: నకిలీ విత్తనాలతో రైతాంగం నష్టపోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బీకే) ద్వారా నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రుడు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున ఇప్పటికే రైతులు పత్తి, మొక్కజొన్న, వరి విత్తనాల కోసం కంపెనీల ప్రతినిధులు, షాపుల చుట్టు తిరుగుతున్నారని తెలిపారు. గతంలో వివిధ రకాల కంపెనీలు విక్రయించిన నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని, రైతుభరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మరాజు, తిరుపంరెడ్డి, దస్తగిరి పాల్గొన్నారు.

రెండు రోజులు మంచినీటి సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే ప్రధాన నీటి వనరు గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద పైపులైను లీకేజీ కారణంగా బుధ, గురు వారాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల అనంతరం నీటి సరఫరాను తిరిగి ప్రారంభిస్తామని, ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి

డోన్ టౌన్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల నిర్వాహకులు టీచర్లపై ఒత్తిడి తెస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాల్పడుతున్న అడ్మిషన్లను అరికట్టాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి పవన్ కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆకర్షించేలా ఆర్భాటంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు టీచర్లను ఇంటింటికీ తిప్పుతూ ఇబ్బందులు పెడుతున్నారని, టార్గెట్‌లు విధిస్తూ హింసిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు రాఘవేంద్ర, అమృత్‌రాజ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ



రైతులకు జీలుగ విత్తనాలను అందజేస్తున్న సుబ్బారెడ్డి

బనగానపల్లె రూరల్: స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఏఓ సుబ్బారెడ్డి రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పచ్చిరొట్ట సాగుతో భూములు చౌడుగా మారకుండా నివారించవచ్చునానరు. ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకొని తమ భూములను సారవంతంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ఓబులేసు, ఆర్‌బీకే ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

‘పచ్చిరొట్ట’ భూమికి శ్రీరామరక్ష

- సమృద్ధిగా భూసారం
- అధిక దిగుబడులకు దోహదం
- 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వ ప్రోత్సాహం



పచ్చిరొట్ట పంట సాగు చేసిన దృశ్యం



పచ్చిరొట్ట సాగు చేసిన భూమిని కలియ దున్నుతున్న రైతు

బనగానపల్లెరూరల్: రైతుభరోసా కేంద్రాల సేవలు సత్ఫలితాలిస్తున్నాయి. వ్యవసాయాధికారుల సూచనలు మేరకు పచ్చిరొట్ట సాగుపై రైతుల్లో అవగాహన పెరిగింది. పంటల దిగుబడులు మరింత పెంచుకోవాలంటే నేలను సత్తువ చేసుకోవాలని రైతులు భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీతో ఆర్‌బీకేల ద్వారా అందించి రైతులను ప్రోత్సాహిస్తుంది కూడా. బనగానపల్లె నియోజకవర్గానికి ఖరీఫ్ సీజన్ రైతులకు 506 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు, మంజూరుకాగా ఇందులో 68 క్వింటాళ్ల పిల్లి పెసర, 10 క్వింటాళ్ల జనుము, 428 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను ఆర్‌బీకేలకు సరఫరా చేసి రైతులకు అందుబాటులో ఉంది. రైతులు గ్రామాల్లో ఉన్న ఆర్‌బీకేలను సంప్రదించి వ్యవసాయ సహాయకుల ద్వారా డి-క్రిష్ దరఖాస్తులో రిజిస్ట్రేషన్ చేయించుకొని రైతు వాటా నగదు చెల్లిస్తే ఏపీ సీడ్స్ ద్వారా నాణ్యమైన విత్తనాలను పొందవచ్చు.

నేల సారవంతం

నేల సత్తువను పట్టించుకోకుండా రైతులు ఏడాదికి రెండు పంటలు సాగు చేస్తుండడంతో పంటల దిగుబడులు తగ్గుతున్నాయి. కూలీల ఖర్చు, కొరతతో పాటు వ్యవసాయంలో పెట్టుబడులు పెరుగుతుండడంతో రైతులు నష్టపోతున్నారు. వాస్తవాలను గుర్తించిన రైతులు పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసి భూమి సారవంతం చేసుకుంటున్నారు. ప్రస్తుతం సాగునీరు సమృద్ధిగా ఉన్నా కూలీల కొరత, వ్యవసాయ ఖర్చులు పెరిగిన కారణంగా పలువురు రైతులు ఎండగారు సాగుపై అనాసక్తి చూపుతున్నారు. ఇలాంటి రైతులు ఈ విరామం సమయంలో పచ్చిరొట్ట సాగు చేసుకొని భూమినిసారవంతం చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడ వ్యవసాయశాఖ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తోంది. ఈ రాయితీని రైతులు బాగా సద్వినియోగం చేసుకుంటున్నారు.

60 రోజుల వ్యవధిసరిపోతుంది

పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లిపెసర, జనుము సాగు చేయాలంటే 45 రోజుల వ్యవధిచాలని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. పచ్చిరొట్ట ఏపుగా పెరిగిన తరువాత భూమిలో బాగా కలియదున్నీ 15 రోజుల పాటు మురగబెట్టాలి. అప్పుడే భూమిలోపల ఉన్న లవణాలు పైకి చేరి నేల సారవతమవుతుంది. ఎండగారు విరామం ఇచ్చిన రైతులు ముందుగానే పచ్చిరొట్టసాగు ప్రారంభించినప్పటికీ, ఎండగారు సాగు చేసిన రైతులు మాత్రం పంట పూర్తయిన తరువాత వేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

దిగుబడులు పెరగాలంటే పచ్చిరొట్టసాగు చేయాలి



పంటల దిగుబడులు పెరగాలంటే రైతులు పచ్చిరొట్టసాగు తప్పనిసరిగా చేయాలి. దీంతో భూమి సారవతంగా అవడంతో పాటు సత్తువ పెరుగుతుంది. ప్రతి ఆర్‌బీకేల్లోనూ జీలుగ, పిల్లి పెసర, జనుము విత్తనాలను 50 శాతంరాయితీ పంపిణీ చేస్తున్నాం. రైతులు సద్వినియోగం చేసుకోని తమ పంటల దిగుబడులను పెంచుకోవాలి.

– సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి బనగానపల్లె మండలం

అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

బనగానపల్లెరూరల్:బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాలీగా ఉన్న రెండు కార్యకర్తల పోస్టుకుల దర ఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ మంగళవారం తెలిపారు. మండలంలో పాతపాడు అంగన్‌వాడీ-2 సెంటర్ బీసీ- సి, కొలిమిగుండ్ల మండలం కోరుమానపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఓసీకి కేటాయించిన్నట్లు తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి 21 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగిన ఉండాలని,జూన్ 4వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ సూచించారు.

డోన్ టౌన్: ఐసీడీఎస్ ప్రాజెక్టు డోన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ శంషాద్‌బేగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పెద్ద మల్కాపురం (బీసీ- డీ)ప్యాపిలి మండలంలోని మానినేనిదొడ్డి(ఈడబ్ల్యూఎస్)గ్రామాల్లో అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అమె తెలిపారు. గతంలోనే నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ ఎవ్వరు దరఖాస్తు చేసుకోలేదని తెలిపారు. జూన్ 4లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

బనగానపల్లె: మండలంలోని గులాంనబీపేటలో శ్రీ పెద్దమ్మదేవరను పురస్కరించుకుని మంగళవారం గ్రామ నడిబొడ్డున ప్రత్యేకంగా అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేశారు. అమ్మవారి ప్రతిమను అందంగా అలంకరించి,గ్రామపెద్దలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బనగానపల్లె ఎస్‌ఐ రామిరెడ్డి, వీరాంజనేయులు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



ఎం,పేండేకల్లు వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, సర్పంచ్



యంబాయి వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, సర్పంచ్

బేతంచెర్ల: ప్రజలకు వలంటీర్లు అందజేస్తున్న సేవలు వెలకట్టలేనివని, సైనికుల్లా పనిచేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యుడు మూర్తుజావలీ, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎం.పేండేకల్లు, యంబాయి గ్రామాల్లో ఎంపీడీఓ వెంగన్న, గ్రామ సర్పంచ్‌లు ముచ్చు రామక్క, యుగంధర్ రెడ్డి, ఎంపీటీసీలు మహేశ్వరమ్మ, నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు నాగ ప్రసాద్, నాగశేఖర్ ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను అందజేశారు. వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేనివిధంగా ప్రజల కోసం ప్రవేశపెట్టిన ఏకైక వ్యవస్థ సచివాలయాలన్నారు. విద్యార్థులు మొదలుకొని వృద్ధుల వరకు వలంటీర్ల సేవలు అందిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నిజాయితితో సంక్షేమ పథకాలు అందజేయడంలో వలంటీర్ల పాత్ర కీలకం అన్నారు. మీరందరూ మరింత బాధ్యతగా పని చేసి రానున్న రోజుల్లో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, గూని నాగరాజు, తిరుమలేశ్వర్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, ముచ్చు పరమేశ్వరయ్య, మురళీధర్‌రెడ్డి, రామనాయుడు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శరవేగంగా అదనపు గదుల నిర్మాణం



అదనపు గదుల నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

ప్యాపిలి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మనబడి నాడు-నేడు కింద అదనపు తరగతి గదులు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని పైకప్పు పెచ్చులూడి పడుతున్న నేపథ్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సమస్యను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి మనబడి నాడు-నేడు రెండో విడత కింద పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేశారు. రూ. 2.04 కోట్లతో మొత్తం 17 తరగతి గదులు మంజూరు కాగా ప్రస్తుతం ఎనిమిది గదుల నిర్మాణ పనులు సాగుతున్నాయి. మరో తొమ్మిది తరగతి గదుల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు హెచ్‌ఎం మధుసూదన శర్మ తెలిపారు.

మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయం



నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర కమిటీ సభ్యులు

డోన్ టౌన్: మానవ హక్కుల పరిరక్షణే సంస్థ ధ్యేయం అని అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఇమ్మానుయేలు, ఉపాధ్యక్షుడు డేవిడ్‌పాల్ తెలిపారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మానవహక్కులపై జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మానవ హక్కులకు భంగం కలిగితే చట్ట పరంగా రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలు, సంప్రదించాల్సిన సంస్థల గురించి వివారించారు. మానవ హక్కుల పరి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ సంస్థలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం డోన్ డివిజన్ స్థాయి నూతన కమిటీని, సోషల్ మీడియా సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వినోద్, ఉపాధ్యక్షునిగా సురేంద్ర,కా ర్యదర్శిగా రాజాలను ఎన్నుకుని గుర్తుంపు కార్డులను జారీ చేశారు. అనంతరం డోన్ కమిటీ రాష్ట్ర కార్యవర్గాన్ని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి యేసప్ప, కడప జిల్లా కార్యదర్శి దేవదానం, సభ్యులు గుండాల లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న నేతృత్వంలో జనరంజక పాలన

- మిన్నంటిన నాలుగేళ్ల పండుగ సంబరాలు
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ
- కేక్ కట్ చేసిన రాష్ట్ర మీట్ కార్పొరేషన్ ఛైర్మన్, పార్టీ పరిశీలకులు



మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

డోన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో జనరంజకంగా పాలన సాగుతుందని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు కోనా మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వ గృహంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని కార్యకర్తల మధ్య నాయకులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసరి ఆదాయంలో రాష్ట్రం ప్రస్తు తం 9వ స్థానంలో ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ ద్వారా రూ.13.5లక్షల కోట్ల పెట్టు బ డులు రానున్నాయన్నారు. వివిధ సంస్థలు, పరిశ్రమలతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకా రం 13.63లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభి స్తాయన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 2.13లక్షల కొత్త ఉద్యోగాలను కల్పించిందన్నారు. ప్రభుత్వ పా ఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే విష యంలో ఒకప్పుడు ఏపి 24వ స్థానంలో ఉండగా, నేడు 7వ స్థానంలో నిలిచిందని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోగ్య సంరక్షణపై చేస్తున్న వ్య యం రెండింతలుగా పెరిగి పేద, మధ్యతరగతి ప్ర జలకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. పెట్టుబడులను ఆకర్షించే రాష్ట్రంగా దేశంలోనే మొట్టమొదటగా ఏపీ నిలిచిన విషయాన్ని వారు గుర్తు చేశారు. మహిళలను మహారాణులుగా చేసేందుకు ప్రభుత్వ ంలో 70 శాతం ప్రత్యక్షంగా, పరోక్షంగా సంక్షేమ పథకాలను వర్తింపచేసిన ఘనత దక్కిందన్నారు. పారిశ్రామిక రంగంలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు రిలయన్స్, ఆదానీ, టీసీఎస్, ఐటీసీ,హీరో మోటోకార్, గ్రాసిమ్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎకోహమా, ఇన్ఫోసిస్ లాంటి అనేక బహుళార్థక కంపెనీలు ప్రభుత్వానికి అండగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, మున్సిపల్ వైఎస్ ఛైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, ధారా హరినాథ్‌రెడ్డి, వంశి, మేకల రాజు, రైల్వే నాగేంద్ర, సుంకన్న, వెంకట్రాముడు, ఆర్ట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

భారీ బైక్ ర్యాలీ

రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల పరిపాలన పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నాయకు లు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం పట్టణంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ శ్రేణుల సంబరాలు మిన్నంటాయి. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహం నుంచి ప్రారంభమైన ర్యాలీ కోర్టు, పోలీసు స్టేషన్ మీదుగా పాతబస్టాండ్ వ రకు సాగింది. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ విభాగం అధ్యక్షుడు పోస్టుప్రసాద్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, పట్టణ గృహసారథుల సంఘం అధ్యక్షుడు కురుకుందు హరి, నాయకులు నాగభూషణంరెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ దినేష్‌గౌడ్, నాగిరెడ్డి, భాస్కర్, చంద్రశేఖర్‌రెడ్డి, కొచ్చెర్వు మధు, మల్యాల భాస్కర్‌రెడ్డి, పెయింటర్ వెంకటేష్, రమణయ్య, గొల్ల రాజు, కంసలి నాగరాజు తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన నిరంతర పోరాటాలు

డోన్ టౌన్: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా వారి పక్షాన సీఐటీయూ యాభైఏళ్లుగా నిరంతర పోరాటాలు చేస్తోందని ఆ సంఘం మండల అధ్యక్ష,కార్యదర్శులు రామాంజనేయులు,శివరామ్ అన్నారు. సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం పురష్కరించుకొని పట్టణంలోని కొండపేటలో ఉన్న బీసీ హాస్టల్ వద్ద ఆటో స్టాండ్‌లో పట్టణ కార్యదర్శి నక్కిశ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామాంజనేయులు పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికుల వేతనాల సమస్యలపై పోరాటాలు చేసి వారికి అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మద్దయ్య, తిమ్మయ్య, మహేష్, శ్రీనివాసులు, రంగడు, బాబు, నాగేశ్వరరావు, బాలు, మోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: స్థానిక సీఐటీయూ కార్యాలయం ఆవరణలో మంగళవారం కార్మిక సంఘం నాయకులు ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హక్కుల సాధనకు కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, ఎల్లయ్య పిలుపునిచ్చారు.

రైతు ఆత్మహత్యపై విచారణ



బాధిత కుటుంబ సభ్యులను విచారిస్తున్న ఏఓ కిరణ్ కుమార్

బేతంచెర్ల: మండల పరిధిలోని మండ్లవానిపల్లె గ్రామానికి చెందిన తలారి చిన్న మద్దయ్య అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం ఏఓ కిరణ్ కుమార్ గ్రామాన్ని సందర్శించారు. తలారి చిన్న మద్దయ్య ఆత్మహత్యకు పాల్పడిన కారణాలపై కుటుంబ సభ్యులను విచారించారు. ఈ నివేదకను ఉన్నతాధికారులకు పంపుతామని ఏఓ తెలిపారు.

వైభవంగా చౌడేశ్వరీ జ్యోతి ఉత్సవాలు



బండిఆత్మకూరులో జ్యోతులను ఊరేగిస్తున్న దృశ్యం

మహానంది: బండిఆత్మకూరు గ్రామంలో కొలువైన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో జ్యోతి మహోత్సవాలు వైభవంగా జరిగాయి. సోమవారం అర్ధ రాత్రి ప్రారంభమైన జ్యోతుల ఊరేగింపు మంగళవారం ఉదయం వరకు కొనసాగింది. కులమతాలకు అతీతంగా అందరూ ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. అమ్మవారిని గంధం, చందం, పసుపు, కుంకుమలతో అలంకరించి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు పదిహేనళ్ల తర్వాత అమ్మవారి జ్యోతి మహోత్సవాలు జరగడంతో గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ బంధుమిత్రులను పిలుచుకుని పండుగను నిర్వహించుకున్నారు. విందు భోజనాలు ఏర్పాటు చేసుకుని ఆత్మీయంగా కలిసిమెలిసి మాట్లాడుకున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆయన సోదరుడు శిల్పా భువనేశ్వరరెడ్డిలు ఉత్సవాలకు హాజరయ్యారు. ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ సంధ్య, ఉప సర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ సుజాతమ్మ, చిన్న సుబ్బారెడ్డి(బాబురెడ్డి), దీపుకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న తెలంగాణ మంత్రులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి మంగళవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ ఎస్.లవన్న, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, అందజేసి సత్కరించారు.

సేవా కార్యక్రమాల్లోనూ అగ్రగణ్యులు ఆర్యవైశ్యులు

శ్రీశైలం: ఆర్యవైశ్యులు వర్తకంలోనే కాకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించడంలోనూ అగ్రస్థానంలో ఉన్నారని తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. స్వామి అమ్మవార్ల దర్శనంతరం ఆయన పాతాళగంగ రోడ్డు మార్గంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల ఆర్యవైశ్య సంఘం నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించారు. యాత్రికుల వసతి సౌకర్యార్థం 142 గదులను నిర్మించేందుకు దేవస్థానం వారు అందిస్తున్న సహాయ సహకారాన్ని కొనియాడారు. అనంతరం సత్ర కార్యవర్గ కమిటీ, సత్రంలో గదులు నిర్మించిన దాతలు మంత్రి హరీష్ రావును ఘనంగా సత్కరించారు.

రహదారులు కళకళ!



నాడు ఆకుమల్ల-శివవరం, బనగానపల్లె రహదారి



నేడు మెరుస్తున్న బీటీ రోడ్డు

సంజామల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహార్దశ పట్టుకుంది. ఏళ్ల తరబడి కనీసం మరమ్మతులకు నోచుకోని రహదారులు ప్రస్తుతం మెరుస్తున్నాయి. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మారుమూల గ్రామాలకు సైతం బీటీ రోడ్లతో రాచబాటలు వేసింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో ప్రతి గ్రామాల్లో చేపట్టిన రోడ్లు కొన్ని పూర్తవ్వగా మరికొన్ని వివిధ దశల్లో పనులు సాగుతున్నాయి. సంజామల మండలం ఆకుమల్ల గ్రామం నుంచి అవుకు మండలం శివవరం, బనగానపల్లె మండలం తమ్మడపల్లె గ్రామాల మీదుగా బనగానపల్లె చేరుకునే రోడ్డు గతంలో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. రూ.9కోట్లతో 18 కిలోమీటర్ల నిర్మించిన బీటీ రోడ్డు ప్రస్తుతం కళకళలాడుతుంది. సంజామల, అవుకు, బనగానపల్లె మండలాల పరిధిలోని కొన్ని గ్రామాలకు ఉపయోగంగా ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.